

జర్మనీలో స్టాఫ్ నర్సు ఉద్యోగాలకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి-పాడేరు: జర్మనీలో స్టాఫ్ నర్స్ పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని ఐటిడిఎ ప్రాజెక్ట్ అధికారి వి.అభిషేక్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అల్లూరి సీతారామరాజు జిల్లాలో బీఎస్సీ నర్సింగ్, జీఎన్ఎం పూర్తి చేసిన వారికి జర్మనీలో స్టాఫ్ నర్సులుగా అవకాశం కల్పిస్తారని తెలిపారు. అభ్యర్థులు రెండు సంవత్సరాలు సాధారణ ఆసుపత్రుల్లో అనుభవం కలిగి జర్మన్ భాష నేర్చుకునేందుకు అసక్తి కలిగి ఉండాలన్నారు. అభ్యర్థులు విజయవాడలోని కెఎల్ యూనివర్శిటీలో నిర్వహించే బీ1 స్థాయి వరకు జర్మన్ భాష శిక్షణ కోసం ఆన్లైన్ తరగతులకు హాజరు కావాల్సి ఉంటుందన్నారు. విమాన చార్జీలు ఉచితం, వసతి, ఆహారం మొదటి ఆరు నెలలు ఉచితంగా అందజేస్తారని తెలిపారు. నెలకు జీతం 1000 యూరోలు చెల్లిస్తారని, ఇండియన్ కరెన్సీలో రూ.89 వేలు ఉంటుందని తెలిపారు. ఇతర వివరాలకు కాల్ సెంటర్ నంబర్కు 9949927899 సంప్రదించాలని కోరారు. 30వ తేదీలోగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఆయన కోరారు.

సమస్యలు వింటూ.. కర్తవ్యం నిర్దేశిస్తూ...

పోరుకేక బృందానికి వెల్లువెత్తిన సంఘీభావం

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి/కుక్కునూరు/ జీలుగుమిల్లి/బుట్టాయగూడెం

నిర్వాసితుల సమస్యలను ఆలకిస్తూ.. కర్తవ్యం నిర్దేశిస్తూ జిల్లాలో రెండోరోజు మంగళవారం ఆరు గ్రామాల మీదుగా 19 కిలోమీటర్ల మేర పోలవరం పోరుకేక మహాపాదయాత్ర సాగింది. ఉదయం ఎనిమిది గంటలకు కుక్కునూరు మండలం దాచారంలో యాత్ర ప్రారంభమైంది. పది గంటలకు మండల కేంద్రమైన కుక్కునూరు చేరుకుంది. ఈ బృందానికి టిడిపి, జనసేన, సిపిఐ నాయకులు సంఘీభావం తెలుపుతూ స్వాగతం పలికారు. టిడిపి నాయకులు మునిశెట్టి నాగు, జనసేన నాయకులు మునిశెట్టి యుగంధర్ వి.శ్రీనివాసరావుకు నిర్వాసితుల సమస్యలను వివరించారు. స్థానిక నిర్వాసితులు ఏ విధంగా ఇబ్బందులు పడుతున్నారో.. పరిహారం అందకపోవడం, ఇళ్ల నిర్మించకపోవడం వంటి సమస్యలను ఆయన దృష్టికి తెచ్చారు. అనంతరం జరిగిన సభలో వీరంతా పాల్గొని మాట్లాడారు. ప్రత్యేక హోదా సాధన సమితి కన్వీనర్ చలసాని శ్రీనివాస్ కుక్కునూరు చేరుకుని పాదయాత్ర బృందానికి సంఘీభావం తెలపడమే కాకుండా రోజంతా పాదయాత్రలో పాల్గొన్నారు. మధ్యాహ్నం జీలుగుమిల్లి మండలంలోని రాచన్నగూడెనికి యాత్ర చేరుకుంది. ఈ సందర్భంగా అక్కడ జరిగిన సభలో పలువురు నేతలు ప్రసంగించారు.

ముంపులో లక్షా ఐదు వేల కుటుంబాలు

మంతెన సీతారాం, సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు

పోలవరంలో ముంపునకు గురవుతున్న ఎనిమిది మండలాల్లో దాదాపు లక్షా ఐదు వేల కుటుంబాలు నిర్వాసితులవుతున్నాయని మంతెన సీతారాం తెలిపారు. చెట్టుకొకరు, పుట్టకొకరు.. అన్నట్టుగా వారి పరిస్థితి తయారైందని ఆవేదన వ్యక్తం చేశారు. నిర్వాసితులకు భూమికి భూమి, 18 ఏళ్లు నిండిన వారికి పునరావాస పరిహారం, వ్యవసాయ కూలీలకు ప్యాకేజీ, కుటుంబానికి ఉద్యోగం ఇవ్వాల్సి ఉందన్నారు. సిఎం జగన్ మాత్రం ఏమీ చేయడం లేదన్నారు. రాచన్నగూడెం పోరాటాల గడ్డ అని, నిర్వాసితులకు అండగా నిలవాలని అన్నారు. మనం ఎకరా భూమి పోతే చాలా బాధపడతామని, నిర్వాసితులు సర్వం కోల్పోతున్నారని అన్నారు. 2013 భూసేకరణ చట్టం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రాజెక్టు నిర్మాణం చేస్తూ నిర్వాసితులను ముంచేస్తున్నారన్నారు. గతేడాది వచ్చిన గోదావరి వరద మోడీ, జగన్ తెచ్చిందేనన్నారు. మళ్లీ వరదలు వచ్చే అవకాశం ఉందని, ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. గతేడాది మాదిరి అడవులు, కొండల పాలు చేయకుండా వెంటనే పునరావాస ప్యాకేజీ ఇవ్వాలని, వరద పరిహారం ఇవ్వాలని కోరారు.

బతికేందుకు దారి చూపించండే పోరుకేక

డి.రమాదేవి, సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు

పోలవరం పోరుకేక పాదయాత్ర మణులు, మాణిక్యాల కోసం జరగడం లేదని, నిర్వాసితులు బతికేందుకు దారిచూపాలని కోరుతుందని డి.రమాదేవి అన్నారు. లక్షల కుటుంబాలను ముంచి ఎవరికి నీరిస్తారని ప్రశ్నించారు. ప్రాజెక్టు బాధ్యత మాది అని చెప్పిన కేంద్రం పూర్తిగా నిధులివ్వడం లేదన్నారు. కేంద్రంలో అమానవీయ ప్రభుత్వం పని చేస్తుందన్నారు. అడగలేని స్థితిలో రాష్ట్ర ప్రభుత్వం ఉందన్నారు. 90 శాతం హామీలు అమలు చేశామని చెబుతున్న జగన్ ముంపు మండలాల పరిస్థితి చెప్పాలన్నారు. అమ్మఒడి, వృద్ధాప్య పింఛను ఇస్తే సరిపోతుందా అని ప్రశ్నించారు. గతేడాది వరదలకు ఇక్కడి ప్రజలు దుర్భర పరిస్థితి ఎదుర్కొన్నారన్నారు. ప్రాజెక్టు కట్టి తెచ్చిన వరద అని అన్నారు. ఇప్పటి వరకూ పదిశాతం కూడా పరిహారం ఇవ్వలేదన్నారు. వచ్చేనెల నాలుగో తేదీన జరిగే సభకు అందరూ తరలి రావాలని పిలుపునిచ్చారు.

నిర్వాసితులకు అండగా నిలబడదాం

ఎ.రవి, సిపిఎం జిల్లా కార్యదర్శి

అంతా పోలవరం నిర్వాసితులకు అండగా నిలబడాలని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి అన్నారు. జీలుగుమిల్లి మండలంలో నిర్వాసితులకు అత్యధిక కాలనీలు నిర్మిస్తున్నారని, వారందరికీ మనం అండగా ఉండాలని కోరారు. జాతీయ ప్రాజెక్టుగా ఉన్న పోలవరం నిర్వాసితులకు దిక్కులేదని, జీలుగుమిల్లి మండలంలో బంగారుపాపమ్మ ప్రాజెక్టు నిర్వాసితుల పరిస్థితి ఏ విధంగా ఉంటుందోనని ఆందోళన వ్యక్తం చేశారు. జీలుగుమిల్లిలో ఆయుధ ఫ్యాక్టరీ నిర్మిస్తే జీలుగుమిల్లి, వంకావారిగూడెం పంచాయతీలు ఖాళీ చేయాల్సి వస్తుందన్నారు. దీన్ని అందరూ తిప్పికొట్టాలన్నారు. 1/70 చట్టం గిరిజనేతరులకు ఎలాంటి నష్టమూ ఉండదన్నారు. గిరిజనులకు, గిరిజనేతరులకు మధ్య విభేదాలు సృష్టిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమానికి సిపిఎం మండల కార్యదర్శి తెల్లం దుర్గారావు అధ్యక్షత వహించారు. సంఘీభావం ప్రకటించిన తలసాని శ్రీనివాస్ యాదవ్ నిర్వాసితుల సమస్యలపై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.వెంకటేశ్వర్లు, అల్లూరి జిల్లా కార్యదర్శి బి.కిరణ్, పశ్చిమగోదావరి జిల్లా కార్యదర్శి బి.బలరాం, విఆర్.పురం ఎంపిపి కారం లక్ష్మి, నాయకులు తెల్లం రామకృష్ణ, మొడియం నాగమణి, వాణిశ్రీ, రాంబాబు, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర నేత ప్రసన్న కుమార్, డివైఎఫ్ఐ రాష్ట్ర నేత రాము, ప్రజానాట్య మండలి రాష్ట్ర నేత మంగరాజు పాల్గొన్నారు.



కుక్కునూరులో వడివడిగా ముందుకు..



మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర నేతలు లోకనాథం, రమాదేవి, ప్రత్యేక హోదా సాధన సమితి కన్వీనర్ చలసాని



భోజన విరామ సమయంలో చెట్ల కింద సేదతీరుతూ..

నా సమస్యను పాదయాత్ర దృష్టికి తెచ్చాను

మేడిపల్లి వెంకటేశ్వర్లు, కుక్కునూరు



నాకు మండలంలోని రామచంద్రాపురంలో మూడెకరాల భూమి ఉంది. ప్రతియేటా వచ్చే వరదలకు చుట్టూ నీరు చేరుతుంది. చుట్టుపక్కల భూములకు పరిహారం ఇచ్చారు. నా భూమికి పరిహారం ఇప్పించండి అని అనేకసార్లు అధికారులు, పార్టీ నాయకుల చుట్టూ తిరిగినా ఫలితం లేకపోయింది. సిపిఎం యాత్ర బృందానికి నా సమస్యను విన్నవించాను.

నిలువ నీడ లేదు.. పైసా పరిహారం లేదు

షేక్ గౌసియా, కుక్కునూరు ఎ బ్లాక్



గతేడాది వచ్చిన గోదావరి వరదలకు మా ఇల్లు కూలిపోయింది. దీంతో మేము కివ్వాక పునరావాస కాలనీలో ఏడాదిగా ఉంటున్నాం. కూలి పనులు చేసుకుంటేనే పూట గడవదు. దీంతో పడిపోయిన ఇల్లు కట్టుకునే స్తోమత లేక కాలనీలోనే ఉంటున్నాం. మాకు ప్రభుత్వం నుండి ఎటువంటి నష్ట పరిహారమూ రాలేదు. ఇప్పటికైనా ప్రభుత్వం మమ్మల్ని ఆదుకోవాలి.

ఇదెక్కడి అన్యాయం

కొవ్వాసి తమ్మయ్య, గిరిజనుడు, వంజంవారిగుంపు



గతేడాది వచ్చిన గోదావరి వరదలకు మా గ్రామం పూర్తిగా మునిగింది. అయితే మా గ్రామం అసలు ముంపులో లేదని అధికారులు చెబుతున్నారు. మా గ్రామం చుట్టూ ఉన్న భూములకు పరిహారం ఇచ్చారు. మా గ్రామం ముంపులో లేదంట. ఇదెక్కడి అన్యాయం. పూర్తి ముంపులో ఉన్న మా గ్రామాన్ని సర్వే జరిపి ముంపులోకి తీసుకొని పరిహారం ఇవ్వాలి.

భూ రీ సర్వేను పక్కాగా చేయాలి

జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్

ప్రజాశక్తి-పాడేరు : ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న రీ సర్వే ప్రక్రియలో ఎటువంటి లోపాలకు తావు లేకుండా చేయాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ స్పష్టం చేసారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయం సమావేశ మందిరంలో పాడేరు, రంపచోడవరం డివిజన్ల పరిధిలోని తహశీల్దార్లుకు, మండల సర్వేయర్లకు భూమల రీసర్వేపై ఒక రోజు వర్కుషాపు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రీ సర్వేలో తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. 9 (2) నోటీసులు, 10(2) 11(1) నోటీసులు జారీ చేసి రైతుల నుండి అభ్యంతరాలను స్వీకరించాలని.. సూచించారు. తప్పులు లేకుండా భూముల రీ సర్వే ప్రక్రియను ఏ విధంగా చేయాలో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. క్షేత్ర స్థాయి నిజ నిర్ధారణలో సమర్ధవంతగా నిర్వహించాలని చెప్పారు. షెడ్యూలు ప్రకారం సర్వే చేయడానికి ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాలను వివరించారు. వివాదాలకు తావు లేకుండా రీ సర్వే చేయాలన్నారు. గ్రామ సరిహద్దులు, ప్రభుత్వ భూములు, ప్రైవేటు భూములను కచ్చితంగా గుర్తించాలని చెప్పారు. విలేజ్ సర్వేయర్ లాగిన్, విఆర్ ఓ లాగిన్ ఏ విధంగా చేయాలో వివరించారు. మండలంలో ఎంత మేరకు భూముల రీసర్వే జరిగిందో తహశీల్దారులకు పూర్తి స్థాయిలో అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో రంపచోడవం ఐటిడి ఏ పిఓ సూరజ్ గనోరే, సబ్ కలెక్టర్ శుభం బన్సల్, డిఆర్ఓ, పి.అంబేద్కర్, సర్వే సహాయ సంచాలకులు వై. మోహనరావు, సర్వే ఇన్స్పెక్టర్ ఎస్.నాగేశ్వరరావు, పాడేరు, రంపచోడవరం డివిజన్ల తహశీల్దారులు, సర్వేయర్లు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న అనీల్

బ్యాంక్ సేవలపై అవగాహన

ప్రజాశక్తి-పాడేరు టౌన్: అల్లూరి జిల్లా కేంద్రం పాడేరు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వద్ద మంగళవారం ఆర్థిక అక్షరాస్యత సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా ఆర్‌బిఐ రీజియన్ హెడ్ అనిల్, విజయనగరం రీజియన్ హెడ్ నరేష్ హాజరై మాట్లాడారు. ప్రజలు ఆర్థికపరమైన లావాదేవీలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. బ్యాంకు సేవలు 100కు పైగా ఉన్నాయని వాటిని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. యూనియన్ బ్యాంకుకు సంబంధించిన యూనో యాప్ ద్వారా బ్యాంకు లావాదేవీలను జరుపుకోవచ్చున్నారు. రుణాలను చెల్లించుటకు బ్యాంకుల చుట్టూ తిరగకుండా ఈ యాప్ ద్వారా చెల్లించుకోవచ్చునని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బ్రాంచ్ మేనేజర్ పివిఎస్ఎం రాజు, ఎల్.భానుచంద్ర, ఎల్ డిఎం రవితేజ, డ్వాక్రా మహిళలు, బ్యాంకు ఖాతాదారులు పాల్గొన్నారు..

5లీటర్ల సారా స్వాధీనం

ప్రజాశక్తి-జి.మాడుగుల: మండల కేంద్రంలో సోమవారం రాత్రి వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా ఐదు లీటర్ల సారాతో జి.మాడుగుల గ్రామానికి చెందిన ఆకులు రమణబాబు పోలీసులకు పట్టుబడ్డాడు. కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



పట్టుబడిన గంజాయి, నిందితులతో పోలీసులు

120 కిలోల గంజాయి స్వాధీనం

ప్రజాశక్తి-మారేడుమిల్లి : వై.రామవరం మండలం మంగంపాడు నుంచి మహారాష్ట్రకు అక్రమంగా తరలిస్తున్న గంజాయిని మారేడుమిల్లి పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎస్సై రాము కథనం ప్రకారం... మహారాష్ట్రకు చెందిన దిగంబర్ చందు రాథోడ్, గిరీష్ దత్తాత్రే బన్సోడ్, ఆకాశ్ నగేష్ రాథోడ్, పవర్ సంతోష్ దిలీప్, ఆకాష్ మధుకర్ చవాన్, కృష్ణ చందు రాథోడ్, సోయల్ షేక్ అనే ఏడుగురు వ్యక్తులు మంగపాడుకు చెందిన మరిగెల్ అరుణ్ కుమార్ నుంచి గంజాయి కొనుగోలు చేసి రెండు కార్లలో మంగపాండు నుంచి మహారాష్ట్రకు తరలిస్తున్నారు. స్థానిక జిఎం.వలస జంక్షన్ వద్ద పోలీసులు తనిఖీలు చేపట్టగా గంజాయి పట్టుబడింది. నిందితుల నుంచి ఆరు బ్యాగులలోని 20 కేజీల చొప్పున ప్యాకింగ్ చేసిన 120 కేజీల గంజాయిని పట్టుకున్నారు. మధ్యవర్తుల సమక్షంలో నిందితులను ఆరెస్ట్ చేసి, గంజాయిని రవాణకు వినియోగించిన వాహనాలను సీజ్ చేశారు. వారి నుంచి ఏడు సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. మరో నిందితుడు అరుణ్ కుమార్ పరారయ్యాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. ఈ గంజాయి విలువ రూ.3.60 లక్షలు ఉంటుందని ఎస్ఐ చెప్పారు.

గ్రామాల్లో జగనన్న సురక్ష సర్వే

ప్రజాశక్తి-కొయ్యూరు : మండలంలోని చిట్టెంపాడు పంచాయితీ పరిధి గోపవరం గ్రామంలో మంగళవారం జగనన్న సురక్ష ఇంటి ఇంటి సర్వే కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఇందులో పాల్గొన్న జెడ్పీటీసీ వారా నూకరాజు, చిట్టెంపాడు సర్పంచ్ నూకలమ్మ, ఉప సర్పంచ్ పాడి ధారలక్ష్మి, వాలంటీర్లు, సచివాలయ సిబ్బంది, ప్రజా ప్రతినిధులు గ్రామంలోని ఇంటింటికి వెళ్లి సమస్యలను, సంక్షేమ పథకాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. జగనన్నకు చెబుదాం కొనసాగింపుగా ప్రజల సమస్యలు తెలుసుకోవడంతో పాటుగా అర్హులైనా పథకాలు రాని వారికోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా జగనన్న సురక్ష కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. సంక్షేమ పథకాలు, ప్రజా సమస్యలు సంతృప్తి స్థాయిలో పరిష్కారమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం జగనన్న సురక్ష పథకాన్ని ప్రవేశ పెట్టినట్లు చెప్పారు. సచివాలయ కన్వీనర్ పెట్ల గాంధీ, పండు, సచివాలయం సెక్రెటరీ కృష్ణకుమారి, విఆర్ఓ జయవాణి, ఇంజనీర్ అసిస్టెంట్ మోహన్, వార్డు సభ్యులు సీతమ్మ, నాగయమ్మ, గృహ సారధులు కాకర ధారమల్లేశ్వరావు, కిరణ్, రమణ బాబు, వాలంటీరు అప్పన్నబాబు, సచివాలయం సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.



సర్వేలో పాల్గొన్న జెడ్పిటిసి నూకరాజు

అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించాలి

-వచ్చే నెల 10,11 తేదీల్లో నిరసనలు -మన్యంలో పలు చోట్ల ప్రచారాలు



పాడేరులో ప్రచారం చేస్తున్న అంగన్‌వాడీలు

ప్రజాశక్తి-పాడేరు: అంగన్వాడీల బడ్జెట్ పెంచాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ జూలై 10,11 తేదీల్లో అల్లూరి జిల్లా కలెక్టరేట్ వద్ద 36 గంటల నిరసన కార్యక్రమం చేపడుతున్నట్లు ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ చింతపల్లి మండల కమిటీ నాయకులు పెంటమ్మ అక్కమ్మ వరలక్ష్మి తెలిపారు. మండల కేంద్రంలో ఐసిడిఎస్ కార్యాలయం వద్ద మంగళవారం ప్రచార కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఐసిడిఎస్‌కు బడ్జెట్ పెంచి, అంగన్వాడీ వర్కర్లకు తెలంగాణ కన్నా అదనంగా వేతనాలు పెంచాలని, గ్రాడ్యుటి ఇవ్వాలన్నారు. ఉద్యోగ భద్రత, కనీస వేతనం, పెన్షన్, పిఎఫ్, ఈఎస్ఐ, గ్రాడ్యుటి, అమలు చేయాలని డిమాండ్ చేశారు. జులై 10న కోర్కెల దినం సందర్భంగా దేశవ్యాప్తంగా పోరాటాలు ఉధృతం చేయాలని తెలిపారు. గర్భిణులకు, బాలింతలకు, చిన్న పిల్లలకు అనేక సేవలు అందిస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోలేదని తెలిపారు. 13 డిమాండ్లతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో శాంతి, రమణమ్మ, రత్నం, ప్రసన్న పాల్గొన్నారు.

అరకులోయ : అంగన్వాడీలకు కనీస వేతనం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ జులై 10, 11 తేదీల్లో జిల్లా కలెక్టరేట్ ముందు నిర్వహించే 36 గంటలు ధర్నాను జయప్రదం చేయాలని సిఐటియు అల్లూరి జిల్లా ఉపాధ్యక్షులు జన్ని భగత్ రాం డిమాండ్ చేశారు. అంగన్వాడి టీచర్ల వద్దకు వెళ్లి కరపత్రాన్ని పంపిణీ చేస్తూ మాట్లాడారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాడ్యుటి అమలు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 9 సంవత్సరాలు గడిచినా అంగన్వాడీ సమస్యలు పరిష్కారం చేయలేదని విమర్శించారు. అంగన్వాడి టీచర్లు, హెల్పర్లు, మినీ అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో, సుశీల బుద్రి తదితరులు పాల్గొన్నారు.

హుకుంపేట: ఐసిడిఎస్‌కు బడ్జెట్ పెంచాలని సీఐటీయూ మండల కార్యదర్శి టి.అప్పల కొండ పడాల్ డిమాండ్ చేశారు. స్థానిక ఐసీడీఎస్ కార్యాలయంలో అంగన్వాడీల కార్యకర్తలతో సమావేశం ఏర్పాటు చేశారు. అనంతరం మాట్లాడుతూ, ఐసిడిఎస్ పరిరక్షణ కోసం ప్రభుత్వం చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఐద్వా జిల్లా నాయకులు ఎస్.హైమావతి, అంగన్వాడీలు పాల్గొన్నారు.



హుకుంపేటలో మాట్లాడుతున్న కొండపడాల్



డుంబ్రిగుడలో వినతిపత్రం ఇస్తున్న అంగన్‌వాడీలు

డుంబ్రిగుడ: ఐసిడిఎస్‌కు బడ్జెట్ పెంచి, తెలంగాణ కన్నా అదనంగా వేతనాలు చెల్లించడంతో పాటు సుప్రీంకోర్టు తీర్పు కనుగుణంగా అంగన్వాడి కార్మికులకు గ్రాడ్యుటి చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఐసిడిఎస్ సిడిపిఓ నీలిమకు అంగన్వాడి కార్యకర్తలు సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా అంగన్వాడి కార్మికుల సంఘం మండల అధ్యక్షురాలు కే కొండమ్మ మాట్లాడుతూ, వైసిపి ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలన్నారు. తక్షణమే అంగన్వాడి కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం మండల కార్యదర్శి కే సత్యావతి, జి.పవిత్ర, అంగన్వాడి కార్యకర్తలు, హెల్పర్లు పాల్గొన్నారు.

పెదబయలు: అంగన్వాడీలకు ఉద్యోగ భద్రత, కనీస వేతనాలు పెంచాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బోండా సన్నిబాబు డిమాండ్ చేశారు. ఐసిడిఎస్ కార్యాలయం వద్ద వర్కర్స్, సహాయకుల (హెల్పేర్స్) సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సన్నిబాబు మాట్లాడుతూ, జులై 10,11 తేదీల్లో 36 గంటల పాటు అల్లూరి జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద జరిగే నిరసనలో పాల్గొవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకురాలు రాజమ్మ, వరహాలమ్మ, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పశు యాజమాన్యంతో ఆర్థిక అభివృద్ధి

రోటరీ క్లబ్ వైజాగ్ మెట్రో అధ్యక్షులు సునీత లావణ్య

ప్రజాశక్తి -హుకుంపేట: పశు యాజమాన్యం తోనే ఆర్థిక భరోసా కలగుతుందని రోటరీ క్లబ్ వైజాగ్ మెట్రో అధ్యక్షురాలు సునీత లావణ్య అన్నారు. మంగళవారం ఉదయం ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, పశు యాజమాన్యంతోనే గిరిజనులకు స్థిరమైన ఆధాయం సమకురుతుందన్నారు. ఇందుకు గాను గిరిజనులు పాడి గొర్రెలు, మేకలు, కోళ్ల పెంపకం చేపట్టి వాణిజ్య పరంగా అభివృద్ధి చెంది ఆదాయం పెంచుకోవాలని అమె సూచించారు. మండలం లోని గన్నేరుపుట్టు పంచాయతీ గన్నేరు పుట్టు, డోంకినవలస గ్రామంలో కోళ్ల పెంపకం ద్వారా వచ్చే నాటు కోడి గుడ్లను రోటరీ క్లబ్ వైజాగ్ మెట్రో వారు స్వయంగా బాయ్ బ్యాక్ పద్ధతిలో రైతులకు ఆధాయం



సమకురుస్తున్నామన్నారు. ఇందుకు ఇద్దరు మహిళ రైతులకు నాటు కోళ్ల పెంపకంకు అవసరమైన పని ముట్లు, కోడి పిల్లలతో సహా ఆరు నెలలకు సరిపడే ఆహారం కూడా ఉచితంగా ఇస్తున్నామన్నారు. రైతులకు చక్కగా నాటు కోడి పిల్లలు పెంచిన తర్వాత స్వయంగా రైతులే గుడ్లు రూ.15 చొప్పున అమ్ముకుని సంవత్సరానికి అధిక ఆధాయం సంపాదించుకోవచ్చు అని ఆమె అన్నారు. కోడి గుడ్లను రోటరీ క్లబ్ వైజాగ్ మెట్రో వారే రూ.15 రైతుల వద్దకు వచ్చి కొనుగోలు చేస్తామన్నారు. ఈ పోజెక్టు బాకూరు పశు వైద్యాధికారి కె.వి వరప్రసాద్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేస్తునట్లు ఆమె తెలిపారు.

విద్యతోనే అభివృద్ధి

ప్రజాశక్తి- పెదబయలు : స్థానిక గిరిజన ఆశ్రమ వసతి గహం పాఠశాలలో మంగళవారం ప్రధాన ఉపాధ్యాయులు నాగేశ్వర్‌రావు అధ్యక్షతన తల్లి దండ్రుల సమావేశం పేరెంట్స్ కమిటీ సమక్షం లో నిర్వహించారు ఈ సమావేశం నిద్దేశించి ప్రధాన ఉపాధ్యా యుడు టి నాగేశ్వర్ రావు మాట్లాడుతూ, బడి ఈడు పిల్లలను ఇంట్లో ఉంచకుండా బడిలో చేర్పించాలని తెలిపారు. చదువు తోనే అభివృద్ధి సాధ్యవడుతుందన్నారు. విద్యార్థుల ఆరోగ్యం పట్ల తల్లి దండ్రులు శ్రద్ధ వహించాలన్నారు. ఈ కార్యక్రమం లో ఉపాధ్యా యులు, పేరెంట్స్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న హెచ్ఎం



ప్రచారం చేస్తున్న ఉపాధ్యాయులు

ప్రభుత్వ పాఠశాలలో చేరాలి

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: తమ పాఠశాలలో నాలుగవ తరగతి నుంచి పదవ తరగతి వరకు సీట్లు ఖాళీగా ఉన్నాయని విద్యార్థులు చేరాలని మండల కేంద్రంలోని గిరిజన ఆశ్రమ బాలుర పాఠశాల ఉపాధ్యాయులు కోరారు. ఈ మేరకు పాఠశాలకు ఎదురుగానున్న గుంటసీమ రోడ్డు వద్ద బ్యానర్ కట్టి ప్రచారం చేశారు. గతంలో ఎప్పుడు లేని విధంగా ఈ యేడాది ఉపాధ్యాయులు విద్యార్థుల ప్రవేశాల కోసం ఈ విధంగా ప్రచారం చేస్తుండటంపై అందరూ ఆశ్చర్యానికి గురయ్యారు.



పెదబయలులో కురుస్తున్న వర్షం

పెదబయలులో వర్షం

ప్రజాశక్తి-పెదబయలు: మండల కేంద్రంలో మూడు రోజులుగా కుండపోత వర్షం కురుస్తుంది. వర్షంతో స్థానికులు, ఉద్యోగులు అవస్థలు పడుతున్నారు. డ్రైనేజి లేక వర్షపు బురదనీరు నేరుగా ఇళ్ల సమీపంలో చొచ్చుకు వస్తుంది. చెత్తా చెదారం రావడంతో దుర్వాసన వెదజల్లుతుంది. విద్యుత్ అంతరాయం ఏర్పడుతుండటంతో పలువురు ఇబ్బంది పడుతున్నారు.



ఫిర్యాదు చేస్తున్న నేతలు

ఎఒపై ఫిర్యాదు

ప్రజాశక్తి-జి.మాడుగుల: కాఫీ ఏవో అప్పల నాయుడు పై చర్యలు తీసుకోవాలని మంగళవారం జి.మాడుగుల కాఫీ కార్యాలయం వద్ద కాఫీ ఏడీకి ఆదివాసీ గిరిజన సంఘ నాయకులు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు సాగిన ధర్మాన మాట్లాడుతూ, గతంలో కాఫీ లైజన్ వర్కర్లను కక్ష పూరితంగా వేధించిన కాఫీ ఏఓపై చర్యలు తీసుకోవాలని ఆ వినతి పత్రంలో పేర్కొన్నట్టు ఆయన స్థానిక విలేకరులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘం మండల అధ్యక్ష కార్యదర్శులు వనుగు సన్యాసిదొర, కొఠారి కోటబాబు, మండల నాయకులు సలగు సత్తిబాబు, లైజన్ వర్కర్లు పాల్గొన్నారు.

అమ్మఒడిలో కోత

నేడు తల్లుల ఖాతాలో నాలుగో విడత నగదు జమ
1,50,870 మందికి లబ్ధి



ప్రజాశక్తి-అనకాపల్లి ప్రతినిధి

ఈ ఏడాది జగనన్న అమ్మఒడి పథకంలో ప్రభుత్వం కోత విధించింది. గతేడాది కంటే లబ్ధిదారుల సంఖ్య స్వల్పంగా తగ్గింది. 2019-20లో పిల్లల తల్లులు పొందిన లబ్ధి తరువాత ఏడాది నుంచి లేదు. తొలి ఏడాది అత్యధిక మందికి లబ్ధిచేకూర్చిన ప్రభుత్వం తరువాత నుంచి విధించిన షరతులు, నిబంధనలతో కొంతమంది అమ్మఒడి సాయం పొందలేకపోతున్నారు. అనకాపల్లి జిల్లాలో తొలిసారి 2019-20లో 1,62,814 మంది తల్లులు లబ్ధిపొందగా, 2022-23 నాటికి ఆ సంఖ్య 1,50,870 మందికి తగ్గింది. నాలుగో విడత అమ్మఒడి పథకం కింద తల్లుల ఖాతాలో నిధులు జమచేసే ప్రక్రియకు బుధవారం ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి శ్రీకారం చుట్టనున్నారు. సిఎం ఈ పథకం కింద డబ్బులు జమచేసే కార్యక్రమ సమయానికి కలెక్టరేట్‌లో కూడా పిల్లలు, తల్లిదండ్రులతో కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి, జిల్లా విద్యాశాఖాధికారి వెంకటలక్ష్మమ్మ, సంబంధిత అధికారులు సమావేశంకానున్నారు.

నాలుగో విడత అమ్మఒడి పథకం కింద విద్యార్థుల తల్లుల ఖాతాల్లో నగదు బుధవారం నుంచి ప్రభుత్వం జమచేయనుంది. లబ్ధిదారులతో పాఠశాలల్లో సన్నాహక సమావేశాలు నిర్వహించారు. తల్లుల ఖాతాలో 15వేలు జమవుతుందా? 13వేలు జమవుతుందా? అన్న స్పష్టత ప్రభుత్వం ఇవ్వలేదు. లబ్ధిదారుల జాబితా కూడా విద్యాశాఖకు పంపకుండా, గ్రామ, వార్డు సచివాలయ వాలంటీర్లకు పంపించడంతో సరైన సమాచారం విద్యాశాఖాధికారులు ఇవ్వలేని పరిస్థితి ఏర్పడింది.

జిల్లాలో 2019-20 నుంచి 2022-23 వరకు అమ్మఒడి లబ్ధిదారులు

సంవత్సరం	లబ్ధిదారులు	నగదు(కోట్లలో)
2019-20	1,62,814	244.22
2020-21	1,49,381	224.07
2021-22	1,52,106	228.15
2022-23	1,50,870	226.30

దౌర్జన్యంగా చెత్తపన్ను వసూలు ఆపాలి

సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి జగ్గునాయుడు

ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ : సచివాలయ సిబ్బందిని, వాలంటీర్లనుపయోగించి ప్రజల నుంచి దౌర్జన్యంగా చెత్తపన్ను వసూలును వైసిపి ప్రభుత్వం ఆపాలని సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు డిమాండ్‌చేశారు. పిఠాపురంకాలనీలోని సిపిఎం కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. చెత్తపన్ను చెల్లించకపోతే అమ్మఒడి పథకం ఆపేస్తామని, చెత్తపన్ను టార్గెట్ ప్రకారం వసూలు చేయలేదని 10 మంది సచివాలయ ఉద్యోగులను సస్పెండ్ చేయడం తదితర చర్యలు ఆపకపోతే ఈ ప్రభుత్వాన్ని ప్రజలు అధికారం నుంచి దించక తప్పదని హెచ్చరించారు. విశాఖ నగర ప్రజలంతా ఆస్తిపన్ను చెల్లిస్తున్నారని, దీనిలో చెత్తసేకరణ ఛార్జీలున్నాయని, మరల ఎందుకు చెత్త పన్ను పన్ను చెల్లించాలని ప్రశ్నించారు. బాధ్యతగల ప్రభుత్వమైతే ప్రజాభిప్రాయాన్ని పరిగణలోకి తీసుకొని చెత్తపన్నును రద్దుచేయాలని డిమాండ్‌చేశారు. చెత్తపన్నులు, కరెంటు ఛార్జీలు తదితర భారాలపై వైసిపి ప్రజాప్రతినిధులను, నాయకులను ఎక్కడికక్కడ నిలదీయాలని పిలుపునిచ్చారు. ఈ రెండేళ్లలో ప్రజల మీద విద్యుత్ భారాలు రూ.7400 కోట్లు వేశారని తెలిపారు. చెత్తపన్ను, ఆస్తిపన్ను భారాలు వేసి నడ్డి విరుస్తున్నారన్నారు. జగన్మోహన్‌రెడ్డికి ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా ఆస్తిపన్ను, కరెంటు ఛార్జీలు రద్దుచేయాలని డిమాండ్ చేశారు. చెత్త పన్ను దౌర్జన్య వసూలు ఆపకుంటే రెండో దశ ఉద్యమం తప్పదని హెచ్చరించారు.

సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డాక్టర్ బి.గంగారావు మాట్లాడుతూ, ప్రజాప్రతినిధులు రక్షణకోసం గన్ లైసెన్స్ కోరడాన్ని తప్పుపట్టారు. నేడు అధికారులు, ప్రజాప్రతినిధుల నుంచి ప్రజలకు రక్షణ కావాల్సి వచ్చిందన్నారు. నిత్యం పన్నులు చెల్లిస్తున్న పేదలపై అధికారులు, ప్రజాప్రతినిధులు వేధింపులకు, బెదిరింపులకు దిగడం సరికాదన్నారు. మధ్యతరగతి, పేద ప్రజలు స్థలాలను కబ్జా చేస్తున్న ప్రజాప్రతినిధులు రక్షణ కావాలని కోరడం పట్ల సిగ్గుపడాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఆర్‌కెఎస్‌వి.కుమార్, జిల్లా కమిటీ సభ్యులు వి.కృష్ణారావు పాల్గొన్నారు.



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న ఎం.జగ్గునాయుడు

అనారోగ్యంతో బాలిక మృతి

ప్రజాశక్తి -పెదబయలు రూరల్: మండలంలోని చెందిన లింగెటి పంచాయతీ మగ్గంవీధి గ్రామానికి చెందిన కొర్ర అప్పారావు కుమార్తె కొర్ర దేవి (3) గత కొన్నేళ్లుగా అనారోగ్యంతో బాధపడుతుంది. మెరుగైన వైద్యం కోసం విశాఖ కెజీహెచ్‌కు తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందింది. తల్లి దండ్రులు కన్నీరు మున్నీరుగా విలపించారు.

ఐఐఎంలో ఎంబిఎ, పిహెచ్‌డి ప్రోగ్రామ్ నూతన బ్యాచ్

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ విశాఖపట్నం తన మాస్టర్ ఆఫ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ ప్రోగ్రామ్‌లోని 9వ బ్యాచ్, 5వ బ్యాచ్ డాక్టోరల్ ప్రోగ్రామ్‌ను మంగళవారం హోటల్ నోవోటెల్‌లో ప్రారంభించింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హెచ్‌పిసిఎల్ సిఎమ్‌డి డాక్టర్ పుష్పకుమార్ జోషి హాజరై ప్రసంగించారు. విద్యార్థులు ఐక్యు (ఇంటెలిజెన్స్ కోషెంట్), ఈక్యు (ఎమోషనల్ కోషెంట్), ఎస్క్యు (ఆధ్యాత్మిక కోషెంట్) అంశాలపై పట్టు సాధించాలన్నారు. సందర్భోచిత జ్ఞానాన్ని మెరుగుపరచుకోవాలని విద్యార్థులకు సూచించారు.

ఐఐఎం విశాఖపట్నం డైరెక్టర్ ప్రొఫెసర్ ఎం.చంద్రశేఖర్ మాట్లాడుతూ, నైపుణ్యాలను పెంపొందించడానికి, అత్యుత్తమ విద్యర్థులుగా మార్చడానికి అధ్యాపకులు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. ఎన్ఐఆర్ఎఫ్‌లో ఇన్‌స్టిట్యూట్ 29వ ర్యాంక్ సాధించడం ఇటీవలి కాలంలో ఇన్‌స్టిట్యూట్ సాధించిన గొప్ప విజయమని అన్నారు. ఈ కార్యక్రమంలో ఐఐఎం విశాఖపట్నం చైర్‌పర్సన్ (అడ్మిషన్) ప్రొఫెసర్ మిలన్ కుమార్ ప్రొఫెసర్ పిఆర్ఎస్ శర్మ, ప్రొఫెసర్ బి.శ్రీరంగాచార్యులు ప్రొఫెసర్ అనురాధ పాల్గొన్నారు.



దీక్షలనుద్దేశించి మాట్లాడుతున్న ఉప్పిలి రామకృష్ణ

బిజెపితో ప్రభుత్వరంగ సంస్థలు నిర్వీర్యం

ప్రజాశక్తి-కలెక్టరేట్, విశాఖ : విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్‌తో సహా ప్రభుత్వ రంగాన్ని కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందని టిఎన్‌టియుసి రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి ఉప్పిలి రామకృష్ణ ఆరోపించారు. స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద కార్మిక ప్రజాసంఘాల జెఎసి ఆధ్వర్యాన చేపట్టిన దీక్షలు మంగళవారం నాటికి 817వ రోజుకు చేరాయి. దీక్షల్లో టిఎన్‌టియుసి కార్మికులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం తీసుకున్న కార్మిక వ్యతిరేక విధానాల వల్ల అసంఘటిత రంగ కార్మికులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. సమాన పనికి సమాన వేతనాలు రావడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో టిఎన్‌టియుసి జిల్లా ఉపాధ్యక్షులు ఎంఎస్.కృష్ణ, నంబాల సత్యనారాయణ, పెద్దాడ పైడిరాజు, పిండి కృష్ణ, కేసుబాయిన అప్పలరాజు, నక్కా పైడిరాజు తదితరులు పాల్గొన్నారు.

విశాఖపట్నం-బెంగళూరు కాంట్ రైళ్ల సేవల పొడిగింపు

ప్రజాశక్తి-ఎంవిపి కాలనీ : విశాఖపట్నం-బెంగళూరు కాంట్ మధ్య ప్రత్యేక రైళ్ల సేవలను పొడిగించాలని ఈస్ట్‌కోస్ట్ రైల్వే నిర్ణయించింది. 08543 విశాఖపట్నం-బెంగుళూరు కాంట్ వారాంతపు ప్రత్యేక రైలు జులై 2 నుంచి జులై 30వ తేదీ వరకు ప్రతి ఆదివారమూ మధ్యాహ్నం 15:55 గంటలకు విశాఖపట్నం నుంచి బయలుదేరి మరుసటి రోజు మధ్యాహ్నం 12:30 గంటలకు బెంగళూరు కాంట్ చేరుకుంటుంది. 08544 బెంగుళూరు కాంట్ విశాఖపట్నం వారాంతపు ప్రత్యేక రైలు జులై 3 నుంచి జులై 31వ తేదీ వరకు ప్రతి సోమవారం మధ్యాహ్నం 15.50 గంటలకు బెంగళూరు కాంట్ నుంచి బయలుదేరి మరుసటి రోజు మధ్యాహ్నం 13.30 గంటలకు విశాఖపట్నం చేరుకుంటుంది. ఈ రైళ్ళు దువ్వాడ, సామర్లకోట, రాజమండ్రి, నిడదవోలు, తణుకు, భీమవరం టౌన్, ఆకివీడు, కైకలూరు, గుడివాడ, విజయవాడ, ఒంగోలు, నెల్లూరు, గూడూరు, రేణిగుంట, కాట్పాడి, జోలార్‌పేట, కుప్పం, బంగారుపేట, బెంగళూరు కెనకపట్నం, కృష్ణరాజపురం మీదుగా ప్రయాణిస్తాయి.

డిగ్రీ ప్రవేశాల గడువు పొడిగింపు

ప్రజాశక్తి -చింతూరు : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రవేశాలకు జులై 5వ తేదీ వరకు గడువు పొడిగించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రత్నమాణిక్యం మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుత విద్యా సంవత్సరం నుంచి డిగ్రీ సింగిల్ మేజర్ సబ్జెక్ట్ విధానం ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. బిఎ ఎకనామిక్స్, బిఎ హిస్టరీ, బీకాం జనరల్ విత్ కంప్యూటర్ అప్లికేషన్స్, బీఎస్సీ కంప్యూటర్ సైన్స్, బీఎస్సీ జువాలజీ, బీఎస్సీ కెమిస్ట్రీ సింగిల్ మేజర్ కోర్సులు అందుబాటులో ఉంటాయని తెలిపారు. జులై 5 వరకు ఆన్లైన్ రిజిస్ట్రేషన్ కోసం కళాశాలలో ఉచిత రిజిస్ట్రేషన్ సౌకర్యం కల్పించామని, జులై 7 నుంచి 12వ తేదీ వరకు వెబ్ ఆప్షన్స్ కళాశాలలో ఉచితంగా నమోదు చేసుకోవచ్చని వెల్లడించారు. 16న సీట్లు కేటాయింపు, 17 నుంచి తరగతులు ప్రారంభమవుతాయని తెలిపారు. ఇతర వివరాల కోసం 9949229236, 9951237879 సెల్ నెంబర్లలో సంప్రదించాలని కోరారు.

బక్రీద్ సందర్భంగా జాగ్రత్తలు పాటించాలి

ప్రజాశక్తి-రాజవొమ్మంగి

రానున్న బక్రీద్ పండుగ నేపథ్యంలో ముస్లిములు జాగ్రత్తలు పాటించాలని స్థానిక సీఐ షేక్ బాజీలాల్ అన్నారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు మంగళవారం స్థానిక సీఐ కార్యాలయం వద్ద స్థానిక ఎస్ఐ టీజీ నరేంద్ర ప్రసాద్ ఆధ్వర్యంలో ముస్లిం మత పెద్దలు, మసీదు కమిటీ సభ్యులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ బాజీలాల్ మాట్లాడుతూ, ముందస్తు చర్యల్లో భాగంగా పీస్ కమిటీ సమావేశం నిర్వహించామని, కమిటీ సభ్యులు సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో ముస్లిం పెద్దలు షేక్ మహమ్మద్ యూసఫ్, రాజవొమ్మంగి మండలం రెహమాన్యా మసీద్ పెద్దలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

సీలేరులో వర్షం

ప్రజాశక్తి -సీలేరు

జీకే మండలం సీలేరులో మంగళ వారం మధ్యాహ్నం వర్షం కురిసింది. రుతు పవనాలు నేపథ్యంలో రెండు రోజులు నుంచి భారీ వర్షాలతో పాటు చిరుజల్లులు కురిసిన విషయం తెలిసిందే. మంగళవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు మబ్బులతో కూడిన వాతావరణం నెలకొంది. అనంతరం మధ్యాహ్నం రెండు గంటల నుంచి మూడు గంటల వరకు వర్షం కురిసింది. అనంతరం సూర్యుడు తన ప్రతాపాన్ని చూపించడంతో ఎండ తీవ్రంగా కాసింది.



సీలేరులో కురుస్తున్న వర్షం

90శాతం రాయితీపై విత్తనాలు

ప్రజాశక్తి -ఎటపాక : రైతులకు 90 శాతం సబ్సిడీతో రైతు భరోసా కేంద్రాల ద్వారా విత్తనాలు సరఫరా చేయనున్నట్టు వ్యవసాయ శాఖ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపింది. ఎంటియు-1064, ఎంటియు- 1061, ఎంటియు -7029, ఎంటియు -1121 విత్తనాలు రైతులకు పంపిణీ చేయనున్నట్లు పేర్కొంది. విత్తనాలు కావలసిన వాళ్లు దగ్గర ఉన్న రైతు భరోసా కేంద్రంలో విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్, విలేజ్ హార్టికల్చర్ అసిస్టెంట్‌ను సంప్రదించాలని సూచించింది. ఇందుకు గాను రైతులు పట్టాదారు పాసు పుస్తకం, ఆధార్ కార్డు, ఫోన్ నెంబర్ ఇవ్వాలని కోరారు.



విత్తనాలు పంపిణీ చేస్తున్న అధికారులు

4న విజయవాడలో మహాధర్నాకు తరలిరండి

సిపిఎం జిల్లా నాయకులు మేకల నాగేశ్వరరావు



కూనవరంలో వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సిపిఎం నేతలు

ప్రజాశక్తి-కూనవరం : పోలవరం నిర్వాసితుల సమస్యల పరిష్కారం కోసం జులై 4న విజయవాడలో జరుగు మహాపాదయాత్రకు ఇంటికో మనిషి ఊరికో బండి లెక్కన తరలిరావాలని సిపిఎం జిల్లా నాయకులు మేకల నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. మహాధర్నాకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను మండల కేంద్రంలో మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలవరం నిర్వాసితుల పోరుకేక పేరున మహాపాద యాత్ర ఈనెల 20 ఎటపాక మండలం నెల్లిపాకలో ప్రారంభమై, జిల్లాలోని నాలుగు విలీన మండలాల్లో పూర్తి చేసుకొని ఏలూరు జిల్లాలో ప్రస్తుతం జరుగుతుందని తెలిపారు. పాదయాత్ర ముగింపు సందర్భంగా విజయవాడలో మహాధర్నా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. పోలవరం ప్రాజెక్ట్ వల్ల నష్టపోయే ప్రతి ఒక్కరి సమస్య అని, అందువల్ల పార్టీలకు అతీతంగా ప్రతి నిర్వాసితుడు ఈ ధర్నాకు రావాలని కోరారు. విజయవాడలో మహాధర్నాను విజయవంతం చేయడం ద్వారా నిర్వాసితుల గోడు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు తెలియజేయాలన్నారు. ఈ‌ో సిపిఎం నాయకులు ఆవుల ఉపేంద్ర, మురళి, తలగాని నాగరాజు, నోముల సత్యనారాయణ, శ్యామల కృష్ణ, తాళ్లూరి శ్రీనివాసరావు, కర్నాటి శ్రీనివాసరావు, కొండా ఈశ్వర్లు భారతి, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

చింతూరు : మహాపాదయాత్ర ముగింపు సందర్భంగా జులై 4న విజయవాడలో జరుగు మహా ధర్నాకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను మంగళవారం మండలంలోని ఎర్రంపేట రచ్చబండ సెంట్రర్ వద్ద సిపిఎం నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి సీసం సురేష్, నాయకులు యారంశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ పోలవరం నిర్వాసితుల సమస్యను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని విమర్శించారు. పోలవరం నిర్వాసితులకు శాశ్వత పరిష్కారం చేపట్టాలని, వరద ముంపు ప్రాంతాల్లో సహాయక చర్యలు, ప్రజానీకానికి హెచ్చరికలు సెంటర్లు, భోజనం ఏర్పాట్లు చేపట్టాలని వారు డిమాండ్ చేశారు. 4న విజయవాడలో జరుగు ధర్నాకు సిపిఎం పొలిట్ బ్యూరో సభ్యులు బివి.రాఘవులు, ఇతర ముఖ్య నాయకులు హాజరవుతున్నారని తెలిపారు. పోలవరం నిర్వాసితుల సమస్యల పరిష్కారం కోసం జరిగే ఈ మహాధర్నకు వేలాదిలా కదిలి రావాలని పిలుపునిచ్చారు సిపిఎం నాయకులు పాండ సుబ్బారావు, నాగమ్మ, సాయమ్మ, పాండు పిచ్చమ్మ, శ్యామల కిట్టమ్మ, కారం దూలమ్మ, పాండు లాలమ్మ, కారం నాగమ్మ, సవలం సుబ్బమ్మ పాల్గొన్నారు.



చింతూరులో వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సిపిఎం నేతలు

మహాపాదయాత్రకు సహకరించిన వారికి ధన్యవాదాలు

ప్రజాశక్తి -విఆర్.పురం : మండలంలో ఈ నెల 24, 25, 26 తేదీల్లో జరిగిన పోలవరం పోరుకేక మహాపాదయాత్రకు సహకరించిన ప్రతి ఒక్కరికీ సిపిఎం విఆర్.పురం మండల కమిటీ ధన్యవాదాలు తెలియజేస్తున్నట్లు ఆ పార్టీ జిల్లా కమిటీ సభ్యులు పూనెం సత్యనారాయణ, మండల కార్యదర్శి సోయం చిన్నబాబు పేర్కొన్నారు. మండలంలోని రేఖపల్లి సిపిఎం కార్యాలయంలో మంగళవారం జరిగిన సమావేశంలో సత్యనారాయణ, చిన్నబాబు మాట్లాడుతూ పాదయాత్రను జయప్రదం చేసిన మండల వ్యాప్తంగా ఉన్న నిర్వాసితులు, అన్ని వర్గాల ప్రజలు, అన్ని పార్టీల నాయకులు, వివిధ ఉద్యోగవ్యాపార వర్గాల వారికి, అభినందనలు తెలియజేస్తున్నట్లు చెప్పారు. బ్రహ్మరథం పట్టి హారతులు ఇచ్చిన మహిళలు, పార్టీలకు అతీతంగా సంఘీభావం తెలిపిన నాయకులకు ధన్యవాదాలు తెలిపారు. ఈ సమావేశంలో నాయకులు పంకు సత్తిబాబు, సోడి మల్లయ్య, కార్యకర్తలు పాల్గొన్నారు.



మాట్లాడతున్న సిపిఎం నేతలు సత్యనారాయణ,చిన్నబాబు

పని చేయని బిఎస్ఎన్ఎల్ నెట్‌వర్క్

ప్రజాశక్తి -సీలేరు: జీకే వీధి మండలం సీలేరులో బిఎస్ఎన్ఎల్ నెట్ వర్క్ సిగ్నల్ పనిచేయకపోవడంతో వినియోగదారులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. బిఎస్ఎన్ఎల్ అధికారుల నిర్లక్ష్యం వలన తరచూ నెట్‌వర్క్ సిగ్నల్స్ పనిచేయడం లేదని, ఫిర్యాదు చేయడానికి కార్యాలయానికి వెళ్లినా ఎవరూ ఉండటం లేదని వినియోదారులు ఆరోపిస్తున్నారు. ఇటీవల బిఎస్ఎన్ఎల్ మేనేజర్ సీలేరు బిఎస్ఎన్ఎల్ కార్యాలయానికి తనిఖీ నిమిత్తం విచ్చేసిన సందర్భంగా ఎటువంటి సమస్యలు లేకుండా అన్ని చర్యలు తీసుకుంటామని ఆయన చెప్పారు. హామీ ఇచ్చిన కొద్ది రోజులకే బిఎస్ఎన్ఎల్ నెట్‌వర్క్ మరమ్మతులకు గురి కావడంతో వినియోగదారులు మండిపడుతున్నారు. సెల్ సిగ్నల్ లేకపోయినా బిల్లులు చెల్లించక తప్పడం లేదని వాపోతున్నారు. ఇప్పటికైనా బిఎస్ఎన్ఎల్ నెట్‌వర్క్ పూర్తిస్థాయిలో పనిచేసే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని వినియోగదారులు డిమాండ్ చేస్తున్నారు.



సీలేరులోని బిఎస్ఎన్ఎల్ టవర్

సమస్యలపై పోరాటాలకు సన్నద్ధం

-'అంగన్‌వాడీ' యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు బేబీరాణి
- ముగిసిన జీపు జాతా



మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షులు బేబీరాణి

ప్రజాశక్తి-రాజవొమ్మంగి : అంగన్‌వాడీ వర్కర్లు, ఆయా సమస్యల పరిష్కారానికి పోరాటాలే శరణ్యమని, అందుకు సిద్ధం కావాలని ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) రాష్ట్ర అధ్యక్షురాలు జి.బేబీరాణి పిలుపునిచ్చారు. అంగన్వాడీల సమస్యల పరిష్కారానికై, ఐసిడిఎస్ పరిరక్షణ కోసం ఈనెల 25, 26, 27 తేదీలలో రంపచోడవరం డివిజన్లో చేపట్టిన జీపుజాత మంగళవారం రంపచోడవరంలో ముగిసింది. యూనియన్ రంపచోడవరం జిల్లా కార్యదర్శి బి.నిర్మల ఆధ్వర్యంలో జరిగిన ఈ జీపుజాతా మంగళవారం దేవీపట్నం మండలం ఇందుకూరుపేట, మారేడుమిల్లి పెదగెద్దాడ మీదుగా రంపచోడవరం వరకు సాగింది. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన సమావేశాల్లో బేబీరాణి మాట్లాడుతూ సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం అంగన్వాడీలకు గ్రాట్యుటీ అమలు చేయాలని, ఉద్యోగ భద్రత, పనికి తగిన వేతనం కల్పించాలని, పెండింగ్ వేతనాలు చెల్లించాలని, పని భారం తగ్గించాలని, ఐసిడిఎస్ అభివద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని, రిటైర్మెంట్ బెనిఫిట్ ఇవ్వాలని, వేతనంలో సగం పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. వైయస్సార్ సంపూర్ణ పోషణ మెనూ ఛార్జీలు పెంచాలని, గ్యాస్‌ను ప్రభుత్వమే సరఫరా చేయాలని, మినీ అంగన్వాడీ కేంద్రాలను మెయిన్ అంగన్వాడీ కేంద్రాలుగా మార్చాలని, మినీ వర్కర్లకు మెయిన్ వర్కర్ వలే జీలాలు ఇవ్వాలని, హెల్పర్లకు ప్రమోషన్లు కల్పించాలని, బీమా వర్తింపజేయాలని కోరారు. రాజకీయ వేధింపులు అరికట్టాలన్నారు. జులై 10, 11 తేదీలలో రంపచోడవరంలో జరిగే ఆందోళన కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో అంగన్వాడీలు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. యూనియన్ నాయకులు కె రామలక్ష్మి, సింగారమ్మ, రత్నకుమారి, ప్రసన్న, వర్కర్లు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లకు కౌన్సెలింగ్



ఆటో డ్రైవర్లకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న ఎస్ఐ షరీఫ్

ప్రజాశక్తి-రాజవొమ్మంగి : మండలంలోని జడ్డంగి పోలీసులు ఆటో డ్రైవర్లకు ట్రాఫిక్ నిబంధనలపై మంగళవారం కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎస్ఐ షరీఫ్ మాట్లాడుతూ ఓవర్ లోడ్, ఓవర్ స్పీడ్ ప్రమాదకరమన్నారు. ఆటో డ్రైవర్లు ప్రతి ఒక్కరూ లైసెన్సులు, వాహన రికార్డులు కలిగి ఉండాలని, వాహదారులు ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ట్రాఫిక్ రూల్స్ పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, పలువురు ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.